

కోరమండల్ ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో కోరమండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ కార్యదర్శి మల్లీశ్వరి మాట్లాడుతూ తమ క్లబ్ అధ్యక్షురాలైన వెంకట దుర్గావతి సూచనల మేరకు ప్రతినెలా ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. సమాజ సేవలో ప్రధానమైనది మానవ సేవని తోటి మనిషికి సేవ చేయడంలో కలిగే ఆనందం ఎనలేనిదన్నారు. ఒకరికి సేవ చేయడంలో లేదా సహకరించడంలో ఉన్న సంతృప్తి కంటే గొప్పది ఏదీ లేదని మల్లీశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, లక్ష్మీ సృజన, విజయలక్ష్మి, మోహిని కుమారి, శిరీష, అడబాల రత్న ప్రసాద్, రాజా తదితరులు పాల్గొన్నారు.

'సంక్షేమం'పై ధరల దరువు

- పెరిగిన కూరగాయలు, నిత్యావసరాల ధరలు
- కష్టంగా మారిన మెనూ అమలు
- అరకొర డైట్ ఛార్జీలు విడుదల
- 5 నెలలుగా పెండింగ్‌లో బిల్లులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పప్పులు, ఆయిల్, పోపులతో బాటు కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సంక్షేమ వసతి గహాల విద్యార్థులకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అండడం లేదు. ప్రభుత్వం చాలీచాలని డైట్ చార్జీలను ఇస్తుండగా మెనూ అమలు చేయడం కష్టంగా మారిందని వార్డెన్లు గగ్గోలు పెడుతున్నారు. అప్పులు చేసి ఆహారం అందించాల్సి వస్తోందని వాపోతున్నారు. దానికి తోడు గత 5 నెలలుగా డైట్ బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. కాకినాడ జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 22 పోస్ట్ మెట్రిక్,12 ప్రి మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో సుమారు 4 వేల మంది పిల్లలు ఏటా చేరుతున్నారు. బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 17 పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో 1058 మంది, 23 ప్రి మెట్రిక్ హాస్టళ్లలో 1048 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు.

సరిపోని డైట్ చార్జీలు

వసతి గృహాల్లో ఉంటూ చదువుకునే మూడు, నాలుగో తరగతి విద్యార్థుల కోసం గతంలో నెలకు ఒక్కొక్కరికీ రూ.1000 (రోజుకి రూ.33) డైట్ ఛార్జీ ఇస్తుండగా ఈ ఏడాది ఫిబ్రవరి 20న రూ.1,150కు (రోజుకి రూ.38) పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఐదు, పదో తరగతి చదువుకునే వారి ఛార్జీలను రూ.1,250 (రోజుకి రూ.42) నుంచి రూ.1,400 (రోజుకి రూ.47)గా చేశారు. ఇంటర్, ఆపై విద్యార్థులకు రూ.1,400 నుంచి రూ.1,600 (రోజుకి రూ.53)కు పెంచారు. జూన్ 1 నుంచి ఈ ఛార్జీలు అమల్లోకి వస్తాయని ప్రభుత్వం చెప్పినా ఛార్జీలు పెరగలేదు. వీటి ప్రకారం విద్యార్థులకు రోజూ ఉదయం టిఫిన్, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం, సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనం కలిపి ఒక్కొక్కరికీ ప్రభుత్వం ఈ మొత్తం మాత్రమే అందజేస్తున్నది.


పిఠాపురంలో ఎస్‌సి బాలికల వసతి గృహం

అయితే బయట మార్కెట్‌లో భోజనం చేయాలంటే రూ.100 తక్కువ లేదు. టిఫిన్ తినాలన్నా రూ.40 ఖర్చు అవుతోంది. ఈ పరిస్థితుల్లో రూ.38 నుంచి రూ.53 ఇస్తున్నందున ఏ మేరకు మెనూ ఛార్జీలను అమలు చేయాలని వార్డెన్లు వాపోతున్నారు. ప్రస్తుతం కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. టమోటా కిలో రూ.170, పచ్చిమిర్చి రూ.120, ఇతర కూరగాయల ధరలు రెట్టింపు అయ్యాయి. కందిపప్పు రూ.150, ఆయిల్ రూ.100 నుంచి రూ.160 అమ్ముతున్నారు. ఇలా అన్ని ధరలు గతంతో పోల్చుకుంటే బాగా పెరిగాయి.

బిల్లులు అందక అవస్థలు

మెనూ బిల్లులు గత 5 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో వార్డెన్లు సతమతమవుతున్నారు. కాకినాడ ఐడియల్ కళాశాల వద్ద ఉన్న బిసి కాలేజీ వసతి గృహంలో సుమారు 100 మంది విద్యార్థులు ఉంటున్నారు. నెలకు రూ.1.60 లక్షలు డైట్ ఛార్జీలు ఖర్చు అవుతున్నాయి. ఇక్కడ 5 నెలల డైట్ ఛార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ హాస్టల్‌కు రూ.8 లక్షలు పెండింగ్ ఉండడంతో అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని వార్డెన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ధరలతో ఈ డైట్ ఛార్జీలు ఏ మాత్రం సరిపోవడం లేదని ఒక్కో విద్యార్థికి కనీసం రూ.2 వేలు ఇవ్వాలని కోరుతున్నారు. పిఠాపురం ఎస్‌సి బాలికల వసతి గృహంలో 150 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఇక్కడ గతేడాది డిసెంబర్ నుంచి డైట్ ఛార్జీలు అండడం లేదు. పాలు, గుడ్లు, కూరగాయలు సరఫరా చేస్తున్న వెండర్లకు మధ్యలో సెలవులు మినహా 7 నెలలు బిల్లులు పెండింగ్లో ఉన్నాయి. సకాలంలో బిల్లులు అందక వెండర్లు తమపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని వార్డెన్ కామేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలతో పోల్చితే నిర్వహణ కష్టంగా మారిందని, పిల్లలకు సరైన పౌష్టికాహారం పెట్టాలంటే కుదరడం లేదని పలువురు వార్డెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పులు, పప్పులు, నూనె, గుడ్లు, చికెన్, గ్యాస్ ఇలా అన్ని ధరలు విపరీతంగా పెరిగాయని దీంతో ప్రభుత్వం ప్రకటించిన మెనూ అమలు చేయడం కష్టంగా మారిందని, ప్రభుత్వం డైట్ ఛార్జీలు పెంచాలని కోరుతున్నారు.


శిబిరంలో మాట్లాడుతున్న రవిచక్రవర్తి

ఫ్యాప్టో ఆధ్వర్యంలో 12 గంటల ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

సిపిఎస్ రద్దు, ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్న 117 జిఒ రద్దు, పెండింగ్ డిఎ, పిఆర్‌సి బకాయిలు విడుదల చేయాలని, బదిలీ, ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు రెండు నెలల జీతాలు చెల్లించాలని కోరుతూ శనివారం ఉపాధ్యాయులు కాకినాడలో నిరసన చేపట్టారు. రాష్ట్రంలో అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద 12 గంటల ధర్నాకు ఫ్యాప్టో ఇచ్చిన పిలుపు మేరకు కాకినాడ జిల్లా ధర్నా చౌక్ వద్ద 12 గంటల ధర్నా చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.అన్నా రాము శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా ఫ్యాప్టో చైర్మన్ టి.రవి చక్రవర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వారంరోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని చెప్పి ఉద్యోగులను మోసం చేసి కొత్తగా జిపిఎస్ అమలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కుట్రను తిప్పికొట్టడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు అందరూ ఉద్యమిస్తామని తెలిపారు. ఫ్యాప్టో కన్వీనర్ కాశీ విశ్వనాథం మాట్లాడుతూ ఈ ప్రభుత్వం పాఠశాల విద్యారంగం నుంచి తప్పుకోవడానికి చూస్తున్నదని, అందులో భాగంగా 117 జిఒ తెచ్చి ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తోందన్నారు. 117 జిఒ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారాము మాట్లాడుతూ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ వర్తించి ఉపాధ్యాయులను ఆందోళనలకు గురి చేస్తున్నారని ఆయన తక్షణం వైఖరి మార్చుకోవాలని, లేకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఎస్టియు రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పిఆర్‌సి బకాయిలు 10 ఏళ్లపాటు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తోందని, బకాయిలు ఈ సంవత్సరం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర వర్మ, ఎపిటిఎఫ్ నాయకులు సుబ్రహ్మణ్యం, ఫిలిప్ రాజు, జెఎసిఎ అసోసియేషన్ నాయకులు కూర్మారావు, యుటిఎఫ్ అధ్యక్షుడు కెవివి.నాగేశ్వరరావు, ఎస్టియు నాయకులు ఎం.శ్రీనివాస్, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పివిఎన్.గణేశ్వరరావు, జిల్లా సహాధ్యక్షురాలు బి.నాగమణి, జిల్లా కార్యదర్శులు ఎంవి.సాయిరాం, ఎస్.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష రంగ పితామహుడు సారాభాయ్

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

భారత అంతరిక్ష రంగ పితామహుడుగా పేరుగాంచిన విక్రమ్ సారాభాయ్ 1919 ఆగస్టు 12న అహ్మదాబాద్‌లో జన్మించారని విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ ఆధ్వర్యంలో భౌతిక శాస్త్రవేత్త విక్రం సారాభాయ్ జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు అవసరాలకు శాటిలైట్లు ఎంతో అవసరమని అప్పటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ వివరించి ఆయన అంగీకారంతో స్పేస్ రీసెర్చ్ సెంటర్‌ను విక్రమ్ సారాభాయ్ ఏర్పాటు చేశారని అన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 1962లో శాంతి స్వరూప్ భట్నాగర్ పురస్కారాన్ని అందించిందని అన్నారు. పద్మ భూషణ్, పద్మవిభూషణ్ వంటి పురస్కారాలను కూడా ఆయనకు కేంద్ర ప్రభుత్వం అందించిందని వెంకటేశ్వర రావు తెలిపారు. అడబాల రత్న ప్రసాద్, రాజా, చింతపల్లి సుబ్బారావు, జి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

సుబ్బయ్య హోటల్లో అధికారుల దాడులు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ సుబ్బయ్య హోటల్‌లో శనివారం ఆహార భద్రతాధికారులు దాడులు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ కె.సుబ్బారావు ఆధ్వర్యంలో దాడులు చేపట్టగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న సుబ్బయ్య హోటల్‌లో కూరల్లో కలిపే కారం సరైనది కాదని అధికారులు తేల్చారు. దీంతోపాటు హోటల్లో అమ్మే తినుబండారాలు, జీడిపప్పు నిల్వలను గుర్తించి వాటి శాంపిల్స్‌ను హైదరాబాద్ పంపిస్తున్నట్లు ఇన్స్పెక్టర్ సుబ్బారావు తెలిపారు. ఆహార భద్రత అధికారులు ప్రముఖ హోటల్లో దాడులు నిర్వహించేటప్పుడు జిల్లా ప్రధాన అధికారులు కచ్చితంగా ఉండాలి. కానీ ఇక్కడ ఇన్స్పెక్టర్, సిబ్బంది ఇద్దరిని మాత్రమే తనిఖీలకు పంపించం వెనుక ఆంతర్యం ఏమిటోనని పలువురు సందేహం వ్యక్తం చేశారు. ఫిర్యాదు దారుడు సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదుకు న్యాయం జరుగుతుందా.. లేక వదిలేస్తారా అని సందేహం వ్యక్తం చేశారు.


తనిఖీ చేస్తున్న అధికారులు

పాడైన వంతెన నిర్మించాలని ధర్నా

ప్రజాశక్తి-కాజులూరు

ఆరేళ్ల క్రితం పాడైన కాజులూరు దుగ్గుదూరు మధ్యలో ఉన్న అంద్రంగి మురుగు కాలవపై ఉన్న వంతెనను వెంటనే నిర్మించాలని కోరుతూ ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం కాజులూరు మురుగు కాల్వ వంతెన వద్ద రాస్తారోకో నిర్వహించారు. ప్రత్యామ్నాయంగా కరకట్టు వెంటనే తొలగించి వ్యవసాయాన్ని మురుగునీరు నుంచి కాపాడాలని మండలంలో పాడైన రోడ్లన్నీ వేయాలని మండలంలో మురుగు కాలవలన్నీ ముందు జాగ్రత్తగా అభివద్ధి చేయాలని డిమాండ్ చేశ్యారు. ఈ సందర్భంగా ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ పాడైన వంతెనకు ప్రత్యామ్నాయంగా వేసిన కరకట్ట వల్ల ద్రాక్షారామం నుంచి ఉన్న వేలాది ఎకరాలు వర్షాలు వచ్చేటప్పుడు వ్యవసాయలన్నీ మునిగి పంటలు పాడవ తున్నాయని, ఈ కరకట్టను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కరకట్టపై అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నిరంతరం రద్దీగా ఉండే ఈ వంతెన నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలన్నాఉ. ఈ మండలంలో ఈ మురుగు కాలవతో సహా అనేక మురుగు కాలువలు వెంటనే బాగు చేయాలని,



ధర్నా నిర్వహిస్తున్న కౌలు రైతులు

మండలంలో ఇప్పటికే శిథిలమైనటువంటి మెయిన్ రోడ్డు సహా అన్ని రోడ్లు ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. ఈ రోడ్లు బాగా లేని కారణంగా నిరంతరం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అనేక ప్రమాదాలకు నిలయంగా మారాయని ఈ సమస్యలన్నీ ప్రజా ప్రతినిధులు అలాగే అధికారులు వెంటనే పూర్తి చేసి ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెనుమల్ల మాజీ సర్పంచ్ వనుం వీరబ్రహ్మం, కడలి రాంపండు, షాజహాన్, వల్లూరి పట్టాభి రామయ్య, మద్దాల వీరాస్వామి, అడపా ఆదినారాయణ, సూడిశెట్టి ఈశ్వరుడు, పెమ్మన బోయిన నాగేశ్వరరావు, ముద్రగడ తిరుపతిరావు ఎలుగుబంటి ఆనంద్ రాంప్రసాద్ యాళ్ల తాతారావు మరియు రైతులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి డ్రైవర్ అంత్యక్రియలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

గుర్తు తెలియని 60 ఏళ్ల మృతదేహానికి అంబులెన్స్ డ్రైవర్ కెబి.అంబేద్కర్ శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. కాకినాడలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా బ్రిడ్జి కింద మృతదేహాన్ని చూసి అంబేద్కర్ తన అంబులెన్స్‌లో తీసుకువెళ్లి స్థానిక విజ్జపురెడ్డి వారి హిందూ శ్మశాన వాటికలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉన్న సమాచారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ తెలియడంతో అక్కడికి కానిస్టేబుల్ వి.మూర్తి, జి.కాంత్ హాజరై అంబేద్కర్ సమక్షంలో మృతదేహాన్ని తరలించారు. తాను సుమారు 12 ఏళ్ల నుంచి అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నానని అంబేద్కర్ తెలిపారు. కాకినాడలో అనాథ మృతదేహాలను తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఒక అంబులెన్స్ ఇస్తే తాను ఉచితంగా సేవ చేస్తానని అంబులెన్స్ డ్రైవర్ అంబేద్కర్ చెప్పారు.

ఎన్‌జి.రంగా యూనివర్సిటీ డైరక్టర్‌గా ఈశ్వరరావు

ప్రజాశక్తి -కరప

గుంటూరు నాగార్జున యూనివర్సిటీ మేనేజ్మెంట్ డైరెక్టర్‌గా పెద్ద కొత్తూరు గ్రామానికి చెందిన చింత ఈశ్వరరావు నియమితులయ్యారు. ఈ పదవికి సంబంధించిన ఉత్తర్వులు చింత ఈశ్వరరావుకు అందడంతో శనివారం కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబును ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. చింత ఈశ్వరరావు రెండుసార్లు పెద్ద కొత్తూరు గ్రామానికి సర్పంచ్‌గా పనిచేశారు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షులుగా, ప్రస్తుతం వైసిపి మండల అధ్యక్షునిగా పని చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్‌పిటిసి వై.సుబ్బారావు, మారెళ్ల వెంకటరమణ, సాదే లోహదాస్, పెదకొత్తూరు సర్పంచ్ చింతా నాగలక్ష్మి బుజ్జి, చీకాల సుబ్బారావు, కాదా వెంకటేశ్వరరావు, గగారిన్ పాల్గొన్నారు.

ఆదిత్యలో ర్యాగింగ్ అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-గండేపల్లి

యుజిసి ఆగస్టు 12వ తేదీని ర్యాగింగ్ నిరోధక అవగాహన దినోత్సవంగా నిర్ణయింకిన నేపథ్యంలో ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో శనివావరం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెద్దాపురం డిఎస్‌పి కె.లతా కుమారి, సిఐ సూర్య అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కళాశాల విద్యార్థులకు ర్యాగింగ్ చేయడం వల్ల కలిగే సమస్యలు, వాటి చట్టాలు వివరించారు. విద్యార్థులు ర్యాగింగ్ కార్యకలాపాల్లో పాల్గొంటే ఎదుర్కొనే పర్యవసానాలపై హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డోలా సంజయ్, కాపుల కల్యాణి, రమేష్ రాజా, పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్, గండేపల్లి

రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ గ్రంథాలయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడుతూ భారత దేశ గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్.రంగనాథం జయంతిని పురస్కరించుకుని ఏటా జాతీయ గ్రంథాలయ దినోత్సవం జరుపుకుంటామని అన్నారు. గ్రంథాలయ శాస్త్ర అభివద్ధికి, గ్రంథాలయాల అభివద్ధికి నిరంతరం ఆయన కృషి చేశారని అన్నారు. గ్రంథ పాలక వృత్తే దైవంగా, పనే జీవితంగా గడిపిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ఆయన 60 పుస్తకాలకు పైగా రచించడంతోపాటు రెండు వేలకు పైగా పరిశోధక వ్యాసాలు ప్రచురించారని సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా చింతపల్లి సుబ్బారావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, జి.కృష్ణమోహన్, శిరీష, రాజా పాల్గొన్నారు. గండేపల్లి సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లోని వివిధ కళాశాలలకు చెందిన గ్రంథాలయాల్లో రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల వికాస అభివద్ధిలో గ్రంథ పాలకుల పాత్ర ఎంతో ఉందన్నారు. గ్రంథాలయ విభాగం అధికారి కె.అశోక్ మాట్లాడుతూ ఏటా అత్యధికంగా గ్రంథాలయం వినియోగించుకున్న వారి నుంచి ఉత్తమ ఉపాధ్యాయులు, ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేసి అవార్డులు ఇచ్చి సత్కరిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డాక్టర్ డోలా సంజయ్, డాక్టర్ కె.రవిశంకర్, డాక్టర్ డి.సతీష్ కుమార్, డాక్టర్ సంజయ్ కుమార్, ఎస్‌టివివిఎస్.కుమార్, వివిధ విభాగాల డీన్‌లు, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శృంగార వల్లభ స్వామికి రూ.4.4 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం తిరుపతి గ్రామంలోని శ్రీ శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం వివిధ టిక్కెట్ల ద్వారా రూ.3,55,820 అన్నదానం విరాళాల ద్వారా రూ.77,409 కేశఖండన ద్వారా, రూ.9,850 ఆదాయం సమకూరిందని ఆలయ కార్య నిర్వహణ అధికారి పులి నారాయణమూర్తి తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహార ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. దేవస్థానం చైర్మన్ కర్రి జగదీష్, ఎంపిటిసి కుంచే బుచ్చిరాజు, ఆలయ అర్చకులు పెద్దింటి నారాయణ ఆచార్యులు, పురుషోత్తమాచార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, రమేష్, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు అంజనీ కుమార్, మార్కండేయులు సేవలందించారన్నారు.


ఆలయంలో అన్నదానం

జి.రాగంపేటలో ఇంటింటి ఓటరు సర్వే

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం జి.రాగంపేటలో శనివారం బిఎల్‌ఒలు వీరబాబు, రమ్య ఆధ్వర్యంలో ఓటర్ లిస్టుల ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామంలోని 44,45 పోలింగ్ బూతుల పరిధి కి సంబంధించి ఇంటింటికి వెళ్లి ఓటర్ లిస్టుల ప్రకారం ఆ డోర్ నెంబర్‌లో ఓటర్ల పేర్లు పరిశీలన జరిపారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ పంచాయితీ 4వ వార్డ్ సభ్యులు దుర్గా ఉమామహేశ్వరి, ఆ గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జల్దాని సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వార్డుల నామినేషన్ల పరిశీలన

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలోని చంద్రంపాలెంలో 4వ వార్డు పదవికి అయిదు నామినేషన్లు, వేట్లపాలెం 14వ వార్డుకు నాలుగు నామినేషన్లు, పవర 5వ వార్డుకు ఒక్క నామినేషన్ వెరశి మూడు వార్డులకు 10 నామినేషన్లు దాఖలవ్వగా 10 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంపిడిఒ శ్రీలలిత ప్రకటించారు. అయితే పవర 5వ వార్డుపదవికి ఒకే నామినేషన్ దాఖలవ్వడంతో వార్డు ఎన్నికల ఏకగ్రీవం అయ్యే పరిస్థితి ఉంది. అయితే అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

ఎంఎల్ఎ పర్వతకు స్వాగతం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఏలేశ్వరం వచ్చిన ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌కు ప్రజా ప్రతినిధులు అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎంఎల్ఎ 9వ వార్డులో పర్యటించి ప్రభుత్వ అభివద్ధి పథకాల గురించి, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, సుంకర రాంబాబు, సామంతుల సూర్యకుమార్, తొండారపు రాంబాబు, కోరాడ ప్రసాద్, పైల విజయ్, జువ్విన వీర్రాజు, వాగు బలరాం, కమిషనర్ కెఎ.కొండలరావు సచివాలయ సిబ్బంది వాలంటీర్లు ఉన్నారు.

కరపలో జనసేన నేత నానాజీ పర్యటన

ప్రజాశక్తి -కరప

మండల కేంద్రమైన కరప గ్రామంలో జనసేన కాకినాడ రూరల్ ఇన్‌ఛార్జి పంతం నానాజీ శనివారం పర్యటించారు. ఆయనకు ప్రజలు పలు సమస్యలు విన్నవించుకున్నారు. పేకేటి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం జనం కోసం పవన్-పవన్ కోసం మనం కార్యక్రమం ద్వారా ఇంటింటి పాదయాత్ర చేస్తూ సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో నానాజీకి నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.



నానాజీకి స్వాగతం పలుకుతున్న నాయకులు

సమాజ ప్రగతిలో యువత ముందుండాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

యువత తమ ప్రతిభకు పదును పెట్టి సమాజం దృష్టిలో ఆలోచిస్తూ నైతిక విలువలతో క్రియాశీలక పాత్ర పోషించాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువత దినోత్సవం పురస్కరించుకుని జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. క్లబ్బులు, పబ్బులు, సినిమాలు, షికార్లు, సెల్ ఫోన్, ఇంటర్నెట్ తదితర వాటికి బందీ కాకుండా చక్కగా చదువుకుంటూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని అన్నారు. నిరాశ నిస్పహలకు లోను కారాదని, కష్టాలకు, వైఫల్యాలకు కృంగిపోరాదని అన్నారు. తల్లిదండ్రులు రాత్రింబవళ్లు కష్టపడి పైసా పైసా సంపాదించి పిల్లలను చదివిస్తున్నారు కాబట్టి వారికి అపకీర్తి తేరాదని అన్నారు. తాత్కాలిక ఆకర్షణ, ఆనందం కోసం యువత బంగారు జీవితాన్ని పాడు చేసుకోకుండా ముందుకు సాగాలని అన్నారు. అవకాశం ఉన్న మేరకు మంచి పనులు చేయడానికి ప్రయత్నించాలని కృష్ణమోహన్ తెలిపారు. అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రాజా పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



కల్తీ ఆహారంతో ఆరోగ్యం పాడై..
నకిలీ డాక్టర్ వద్దకు వెళ్లారు పిన్నీ..!!



ప్రతిజ్ఞ చేయిస్తున్న పౌండేషన్ చైర్మన్ బాలకృష్ణ

మెడికవర్‌లో అవయవ దాన దినోత్సవం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

మానవాళికి వైద్యపరమైన గొప్ప కానుకల్లో అవయవ దానం ఒకటని రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వైడి.రామారావు, మల్టీ ఆర్గాన్ పౌండేషన్ చైర్మన్ బాదం బాలకృష్ణ, మెడికవర్ సెంటర్ హెడ్ సిద్ధార్థ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ అవయవాల దాన దినోత్సవం సందర్భంగా స్థానిక అచ్చంపేట మెడికవర్ హాస్పిటల్లో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. అన్ని దానాలల్లో కెల్లా ప్రాణదానం గొప్పదని ప్రాణదానం చేయడంలో ముఖ్య పాత్ర పోషించేది అవయవదానమని చెప్పారు. ఏదైనా అవయవ సంబంధిత ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న వ్యక్తికి దానం చేయడం ద్వారా ఆ వ్యక్తికి కొత్త జీవితాన్ని అందించవచ్చని చెప్పారు. అవయదానానికి ఇష్టపడితే, వెంటనే జీవన్‌దాన్ సంస్థకు తెలియజేస్తే దానం చేసే అవయవాల ద్వారా కనీసం మరో 8 మందికి ప్రాణం పోసే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం అవయవదానం చేసిన కుటుంబ సభ్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ కల్యాణ్ బాబు, ఆదిత్య ఆపరేషన్స్ హెడ్ ఖాద్రి, నర్సింగ్ సూపరింటెండెంట్ వరలక్ష్మి, ఆదిత్య నర్సింగ్ విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పంట కాలువలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం రూరల్ మండలం కామనగరువు పెట్రోల్ బంక్ సమీపంలోనీ పంట కాలువలో శనివారం మృతదేహం లభ్యమైంది. మండలంలోని నల్లమిల్లి గ్రామానికి చెందిన జంగా రామ్ కుమార్ (27) ఈ నెల 11న అమలాపురం తూర్ల కంపెనీకి పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. తిరిగి రాత్రి రామ్‌కుమార్ ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అమలాపురం చుట్టుపక్కల వెతుకుతుండగా శనివారం మధ్యాహ్నం కామనగరువు పెట్రోల్ బంక్ ఎదురుగా పంట కాలువలో శవం ఉన్నట్లు తెలిసి వెళ్లి చూడగా రామ్ కుమార్‌దిగా కుటుంబ సభ్యులు గుర్తించారు. ఈ మేరకు వారు అమలాపురం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. తగు చర్య నిమిత్తం తాలూకా పోలీస్ వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అదుపుతప్పి కంటైనర్ బోల్తా

ప్రజాశక్తి-గోపాలపురం

ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి వ్యాన్ బోల్తా పడిన సంఘటన శనివారం రోడ్డు లంకలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు నుంచి ఒక పార్సిల్ సర్వీస్ ఐసర్ వ్యాన్ కంటైనర్ రాజమండ్రి పార్సిల్ అన్లోడ్ చేసి తిరిగి హైదరాబాద్ వెళుతుండగా గోపాలపురం, దేవరపల్లి మండలం గొల్లగూడెం మధ్య వచ్చేసరికి రోడ్డు మలుపు కావడంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పింది. ఈ ఘటనలో విద్యుత్ పోలు విరిగిపోయింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- తాళ్లరేవు

రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందడంతో తాళ్ళరేవు పంచాయతీ గుత్తులవారి పాలెంలో విషాదం అలముకుంది. మండలంలోని తాళ్లరేవు గ్రామం ముత్యాలమ్మ గుడి సమీపంలో రెడ్డి వెంకట్రావు స్మారక భవనం వద్ద సచివాలయం-2 ఎదురుగా శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన వాసంశెట్టి ప్రసాద్ (46) మరణించడంతో గుత్తులవారిపాలెం అంతా శోకసంద్రంలో మునిగిపోయింది. ప్రసాద్ సోదరుడు పదేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించగా ఉన్న ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో అసువులు బాసాడని వాసంశెట్టి ప్రసాద్ తల్లిదండ్రులు నాగవేణి, వెంకటేశ్వర్లు బోరున గుండెలవిసేల రోదిస్తున్నారు.

ముగ్గురు ఎస్ఐలు బదిలీ

ప్రజాశక్తి-అమలాపురం

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ముగ్గురు ఎస్ఐలను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మామిడికుదురు మండలం నగరం ఎస్ఐ జానీ బాషా పామర్రు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అవగా, రాయవరం ఎస్ఐ సురేష్‌ను నగరం స్టేషన్‌కు బదిలీ చేశారు. అమలాపురం విఆర్‌లో ఉన్న జి.నరేష్‌ను రాయవరం పిఎస్‌కు బదిలీ చేశారు.



పరామర్శిస్తున్న జ్యోతుల నెహ్రూ

పలువురిని పరామర్శించిన నెహ్రూ

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి, మల్లేపల్లి, జెడ్.రాగంపేట గ్రామాలకు చెందిన పలువురిని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ పరామర్శించారు. గండేపల్లి గ్రామానికి చెందిన నందం రాంబాబు ఇటీవల కాలుకి ఇన్ఫెక్షన్ కావడంతో వైద్యం చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామానికి చెందిన నక్క సూర్యనారాయణ, గద్దె రామచంద్ర రావు, పల్లి రాముడు ఇటీవల మరణించడంతో వారి కుటుంబాలను మల్లేపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పోతుల చక్రం, అదే గ్రామానికి చెందిన నట్టే పకీర్ ఇటీవలే మరణించడంతో వారి కుటుంబాన్ని, జెడ్ రాగం పేటకు చెందిన దేవరపల్లి అన్నవరం, అదే కుటుంబానికి చెందిన దేవరపల్లి ముత్యాలమ్మ ఇటీవల మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతులమోహనరావు, దాపర్తి సీతారామయ్య, అడబాల భాస్కరరావు, వెలమాటి కాశి, కందుల కొండయ్య చౌదరి, ఇప్పర్ల బాబి, చాగంటి సత్యనారాయణ మూర్తి, వెంపాటి రాజు, ఇప్పర్ల సురేష్, పైలా వెంకన్న, ఉప్పలపాటి సత్తిబాబు, ఉండవల్లి వరప్రసాద్, కురుకూరి శ్రీనివాస్, వెంపాటి సతీష్, కన్నబాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై గడపగడపకూ..

ప్రజాశక్తి-పెదపూడి

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని గొల్లల మామిడాడలో శనివారం మూడోరోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి సంక్షేమ పథకాల ఒరవడిని కొనసాగిస్తు న్నారన్నారు. అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసి ఆర్థిక భరోసాను కల్పిస్తున్నారని అన్నారు. సంక్షేమ పథకాలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కేతా తులసి శ్రీనివాస్, జెడ్‌పిటిసి సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ లంక మున్ని, వైస్ ఎంపిపి ద్వారంపూడి పద్మ వెంకట్ రెడ్డి, ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి (హంస), ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, లయన్స్ క్లబ్ శ్రీ సూర్య అధ్యక్షులు కడిమి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేతల పరామర్శలు.. ప్రజల నిరసనలు..



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో పర్యటించిన ముఖ్యనేతల పర్యటనలు ఆద్యంతం ఆత్మస్తుతి... పరనిందలకే పరిమితం అయ్యాయి. గోదావరి వరద బాధితులను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, ప్రతిపక్షనేత నారా చంద్రబాబు రెండు రోజుల పాటు వేర్వేరుగా జిల్లాలో పర్యటించిన విషయం విదితమే. పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయంచని కేంద్ర ప్రభుత్వంపై ఒక్క విమర్శ కూడా చేయకపోవటం ప్రజలను విస్మయానికి గురి చేసింది. మణిపూర్‌లో జరిగిన ఘోరాలకు నిరసనగా పార్లమెంటులో ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మాణానికి సైతం ఎన్‌డిఎకు మద్దతు తెలపటం విశ్వసనీయతకు దర్పణం పట్టింది. ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి కోనసీమలో రక్షణ గోడలు నిర్మిస్తామని ఇచ్చినహామీపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. నాలుగేళ్లుగా ఏమిచేశారనే ప్రశ్న తలెత్తుతోంది. గతేడాది చేపట్టిన పర్యటనలో ఏటిగట్లు పటిష్టం చేస్తామని ఇచ్చిన హామీలు నీటిమీద రాతలుగా మిగిలాయి. దీంతో తాజా హామీనైనా నిలబెట్టుకోకుంటే రాబోయే ఎన్నికల్లో పరాభావం తప్పదని వరద బాధితులు మండిపడుతున్నారు. మరో వైపు చంద్రబాబు నిర్వహించిన దేవరపల్లి, కోరుకొండ సభలలో ప్రజలపై వరాల జల్లు కురిపించారు. ప్రధానంగా రాజానగరం ఎంఎల్ఎపై చేసిన విమర్శలు జిల్లాలో చర్చనీయాంశం అయ్యాయి. సాగునీటి ప్రాజెక్టుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసిన ప్రతిపక్ష నేత చంద్రబాబు పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయింపులో నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తీరును ప్రశ్నించకపోవటం పారదర్శకతను ప్రశ్నిస్తోంది. ఇరువురి పర్యటనలు ఎన్నికలే లక్ష్యంగా చేస్తున్నారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఒక వైపు విద్యుత్ బిల్లులు... మరో వైపు కోతలు

విద్యుత్ ఛార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నడ్డి విరుస్తోందంటూ వినియోగదారులు వాపోతున్నారు. వినియోగపు ఛార్జీలకు రెట్టింపుగా బిల్లులు జారీ చేయటం విమర్శలకు దారి తీస్తోంది. విద్యుత్ సంస్థలకు సర్ ఛార్జీలు వసూళ్లు చేసేందుకు అవకాశం కల్పించిన విషయం విదితమే. దీంతో వివిధ రకాల పేర్లతో వసూళ్లకు సంస్థ తెరలేపింది. గతంలో నెలకు 450 వచ్చే వారికి సైతం గత రెండు నెలలకు రూ.700పైగా బిల్లులు జారీ చేసినట్లు తెలుస్తోంది. వినియోగపు యూనిట్లు యథాతథంగా ఉన్నప్పటికీ అదనపు ఛార్జీలు విధించటంతో బిల్లులు ఆకాశాన్నంటుతున్నాయని వాపోతున్నారు. మరో వైపు విద్యుత్ కోతలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గడచిన వారం రోజులుగా ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయి. దీంతో విద్యుత్ వినియోగం పెరిగిందని అధికారులు చెబుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా లేకపోవటంతో రొటేషన్ పద్ధతిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని జవాబివ్వటం విస్తుగొలుపుతోంది. రోజుకు గంట నుంచి 2 గంటలకు పైగా విద్యుత్ కోతలు విధించటం ప్రజలను ఆందోళనకు గురి చేస్తుంది. ప్రభుత్వం చొరవ చూపి ఛార్జీల భారం తగ్గించాలని అదే విధంగా నాణ్యతతో కూడిన సరఫరా చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

కేంద్ర కార్మిక సంఘాల ఆందోళన బాట

క్విట్ ఇండియా స్ఫూర్తితో మోడీ ప్రభుత్వంపై కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన ఆందోళనలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మిన్నంటాయి. కాకినాడలో కార్మిక, కర్షక, ప్రజా సంఘాల నేతలను అక్రమ అరెస్టులు చేయటం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పౌరహక్కులను హరిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఎదుట కార్మిక, కర్షక, ప్రజా సంఘాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో ఐక్యంగా చేపట్టిన ఆందోళనలకు వందలాది మంది తరలి వచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన నిరసనలు హోరెత్తాయి. గడచిన 9 సంవత్సరాలలో మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం వినాశకర ఆర్థిక విధానాలనే అవలంభించిందని కార్మిక సంఘాల ప్రతనిధులు మండిపడ్డారు .రాబోయే రోజుల్లో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

దిగొచ్చిన టమోటా

టమోటా ధరలు తగ్గడంతో సామాన్య ప్రజలకు కొంత ఊరట లభించింది. బహిరంగ మార్కెట్లో కేజీ టమోటా రూ.60 కాగా రైతు బజార్లలో రూ.40 చొప్పున అందుబాటులోకి వచ్చాయి. గత నెల రోజులుగా కేజీ రూ.200 నుంచి రూ.220 వరకూ విక్రయాలు జరిగిన విషయం విదితమే. చికెన్ ధరలతో సైతం టమోటాలు పోటీ పడటం ఇదే తొలసారని వ్యాపారులు చెబుతున్నారు. ధరలు దిగిరావటంతో కొనుగోలు దారులతో పాటు వ్యాపారులకు ఊరట లభించింది.

యానాం వార్తలు

బాల పురస్కార్ అవార్డుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - యానాం

క్రీడలు, సామాజిక సేవా రంగాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన పిల్లలకు తగిన గుర్తింపునిచ్చేందుకు ప్రతి సంవత్సరం భారత ప్రభుత్వం మహిళా శిశుఅభివద్ధి మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మకమైన ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డును అందజేస్తుందని ఆర్ఎఒ మునిస్వామి తెలిపారు. ఈ మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 ఏళ్ల లోపు ఉన్న చిన్నారులు https://awards.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఢిల్లీలో భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు ప్రదానం ఉంటుందన్నారు.

యానాంకు మంత్రి లక్ష్మీనారాయణ రాక

ప్రజాశక్తి - యానాం

ఆగస్టు 15న స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియంలో జరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా జాతీయ పతాకాన్ని ఎగురువేసేందుకు పుదుచ్చేరి ప్రజా పనుల శాఖ మంత్రి కె.లక్ష్మీనారాయణ రానున్నట్లు శనివారం ఆర్ఎఒ మునిస్వామి తెలిపారు.

పోలీస్ కవాతుకు రిహార్సల్స్

ప్రజాశక్తి - యానాం




రిహార్సల్స్ చేస్తున్న పోలీసులు

స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియంలో ఆగస్టు 15వ తేదీన నిర్వహించే పోలీస్ కవాతు కోసం రిహార్సల్స్ చేస్తున్నారు. ఎస్‌పి రఘునాయిగం, సిఐ షణ్ముగం, ఎస్ఐ శేరు నూకరాజు, కట్టా సుబ్బరాజు, ట్రాఫిక్ ఎస్ఐ పువ్వుల వీరభద్రస్వామి పోలీస్ కవాతు సాధనను పరిశీలించి పోలీసులకు సూచనలు ఇస్తున్నారు.

లయన్స్ విజన్ ఆధ్వర్యంలో సీమంతాలు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్



సీమంతాలు చేస్తున్న సభ్యులు

రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ అంగన్వాడి కేంద్రంలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో శనివారం పండుగ వాతావరణంలో సీమంతాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా క్లబ్బు అధ్యక్షురాలు ఎం.ప్రసూన మాట్లాడుతూ గర్భవతులకు సీమంతాలు జరిపే ఆచారం అనాదిగా ఉందన్నారు. అమ్మకు, అమ్మతనానికి ఇచ్చే గౌరవం మన దేశ సంస్కృతిలో మరింత ఎక్కువ కాబట్టి సామూహికంగా సీమంతలు నిర్వహిస్తున్నామని అన్నారు. దీనివలన గర్భిణులకు మానసిక భరోసా కలుగుతుందన్నారు. శారీరిక, మానసిక ఆరోగ్య భద్రతతో కూడిన భరోసాను కల్పించేందుకు సీమంతాలు దోహదపడతాయన్నారు. తల్లి మానసిక ఆనందం పుట్టబోయే బిడ్డ మానసిక ఆరోగ్య మీద ప్రభావం చూపుతుంది కాబట్టి ఎప్పుడు ప్రశాంతంగా ఉండాలని ప్రసున తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ శ్రీరామ్ గణేష్ ప్రసాద్, ఎన్.శ్రీదేవి రెడ్డి, బి.వాణి, రమా సుందరి, శ్రీవాణి, డాక్టర్ శిరీష, అడబాల రత్న ప్రసాద్, అంగన్వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వేతనాల పెంపుపై ఉద్యోగుల హర్షం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సెర్ప్ ఆధ్వర్యంలో వివిధ స్థాయిల్లో పని చేస్తున్న 4,569 మంది ఉద్యోగులకు 23 శాతం జీతం పెంచుతూ ప్రభుత్వం జిఒ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం సిఎం వైఎస్.జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఉద్యోగులు మిఠాయిలు పంచి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎపి సెర్ప్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.ధనుంజయరెడ్డి మాట్లాడారు. సెర్ప్ ఉద్యోగుల కష్టాన్ని గుర్తించి జీతం పెంపుదల చేయడంపై సిఎం జగన్‌కు కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ వై.శ్రీరమణి, ఎల్ 4 సంఘం అధ్యక్షులు తోట అశోక్ భరత్, ఎల్ 3 సంఘం అధ్యక్షులు పుప్పాల సూర్యనారాయణ, డిపిఎం బాబూరావు, ఎపిఎం బి.ప్రశాంతి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారంటీపై టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్



ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు అనంత లక్ష్మి

రాష్ట్రంలోని నిరుపేదలను సంపన్నులను చేయడమే టిడిపి అధినేత చంద్రబాబు ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి పేర్కొన్నారు. మండలపరిధిలోని ఇంద్రపాలెంలో శనివారం నిర్వహించిన 'మహాశక్తి-భవిష్యత్తు గ్యారెంటీ'లో భాగంగా 'వస్తున్నా- మీ గ్రామానికి- మీ అనంతలక్ష్మీ' 26వ రోజు కార్యక్రమం నిర్వహించారు. తెలుగు మహిళలు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి భవిష్యత్తుకు గ్యారెంటీ పథకంపై వివరించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగన్ జలగలా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చేది పైసా, జేబులో వేసుకునేది వంద రూపాయలు అనేలా సంక్షేమ పథకాల అమలు తీరు ఉందన్నారు. గ్రామస్వరాజ్యాన్ని తీసుకు వచ్చింది ఎన్టీఆర్, చంద్రబాబు అయితే ఆ గ్రామస్వరాజ్యాన్ని నిర్వీర్యం చేసింది జగన్ అని ధ్వజమెత్తారు. పోలవరం, చింతలపూడి ప్రాజెక్టులకు రూపాయి ఖర్చుపెట్టింది లేదని అన్నారు. తెలుగుదేశం పార్టీతోనే అన్ని వర్గాలకు భరోసా అని అన్నారు. పలు కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు ఇచ్చామని గుర్తు చేశారు. ప్రజల సంక్షేమం కోసం చంద్రబాబు మినీ మ్యానిఫెస్టోను ప్రకటించారన్నారు. సంపద ఎలా సృష్టించాలో తెలిసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్మోహనరెడ్డి అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. మన రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబు వంటి నాయకులను ఆదరించాలన్నారు. రాష్ట్రాన్ని దివాలా తీసిన వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని, మీ పిల్లల బంగారు భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబును ఆదరించి గెలిపించాలని అనంతలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి సరిదే నాగ హరినాథ్, నాయకులు పండూరి జయకృష్ణ, మరుకుర్తి నాగబాబు, పంపన బుజ్జి, పుల్లయ్య శ్రీను, టేకుమూడి శ్రీను, కాకరపల్లి మోహన్ రావు, బొజ్జ భవాని సాంబశివరావు, కొమిరిశెట్టి నర్సింగరావు, దొమ్మేటి వెంకటరమణ, కింతాడ శేఖర్, గుబ్బల సత్తిబాబు, గొల్లపల్లి లక్ష్మి, పిల్లి శ్రీధర్, చల్మాజీ, పెంకే వీరబాబు, కొల్లుబోయిన అచ్యుత్, టేకుమూడి శ్రీనివాస్, చాత్రాతి సాయిబాబా, పలివెల గాయత్రి, పిల్లి విజయ్ గోపాల్, కందర్ప సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపితో అన్ని రంగాల్లో మహిళల అభివృద్ధి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంతోనే మహిళలు అన్ని రంగాల్లో అభివద్ధి చెందారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని రాజపూడిలో శనివారం మహాశక్తి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలతో కలిసి ప్రచారం నిర్వహించారు. అనంతరం నెహ్రు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆస్తిలో సమాన హక్కు కల్పిస్తూ చట్టం చెయ్యడంతో ఆంధ్రప్రదేశ్ మహిళల గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిరన్నారు. మహిళలకు డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసి ఆర్థిక పరిపుష్టి సాధించిన నాయకుడు చంద్రబాబు అన్నారు. చట్ట సభల్లో రిజర్వేషన్లు ఇచ్చి వారిని సగర్వంగా తిరిగేలా చేసిన నాయకుడు చంద్రబాబు అన్నారు. 2014 నుండి 2019 వరకు మహిళలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు తీసుకు వచ్చి అభివద్ధి పరిచారన్నారు. చంద్రబాబు ఆడబిడ్డకు పెళ్లి కానుకను ఇస్తే వైసిపి ప్రభుత్వం ఆ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసిందన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మహిళలను ఆర్థికంగా కుంగదీసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పోలినాటిధర్మానందకుమారి, నకిరెడ్డి సూర్యవతి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ



మండలంలోని బలభద్రపురంలో ఎస్ఐ సిహెచ్.విద్యాసాగర్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ప్రజలకు పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విద్యాసాగర్ మాట్లాడుతూ ఎస్‌పి ఎస్‌పి సతీష్ ఆదేశాల మేరకు ఈ అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. రాత్రి సమయంలో ఆరుబయట లేదా మేడపైన నిద్రించేవారు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. వివాహాది శుభకార్యాలకు, వ్యక్తిగత పనులు నిమిత్తం ఇల్లు విడిచి కుటుంబ సమేతంగా వెళ్లేవారు ముందుగా జగ్గంపేట స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. రాజపూడి గ్రామ పరిధిలో పీస్ కమిటీని నియమించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మరోతి శివగణేష్, సిదిరి సత్తిబాబు, యర్ర రామకృష్ణ, పప్పల అప్పలరాజు పాల్గొన్నారు.